బాలికల విద్యతో సమాజంలో మార్పు



లాలాపేట: బాలికలు విద్యావంతులు కావడం ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, అందుకే ఉన్నత విద్యలో బాలికలంతా రాణించాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి అలగు ముత్తురామన్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం లాలాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన బాలికా దినోత్సవం వేడుకల్లో ముత్తురామన్ పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం పునాదిపై ఏర్పడిందన్నారు. బాలికల రక్షణ కోసం రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలపై అవగాహన కల్పించారు. గణతంత్ర దినోత్సవం ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పులినవీన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గన్‌బజార్ జిల్లా పరిషత్ పాఠశాలలో..

రసూల్‌పురా: జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా రసూల్‌పురా గన్‌బజార్ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ పాల్గొని స్టేషనరీ, రాత పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల విద్యతో సమాజంలో అసమానతలను తగ్గించి వారికి శక్తినిస్తుందన్నారు. విద్యావంతులైన మహిళలతో సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నాయన్నారు. హెచ్‌ఎం గణేష్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీలత, షాహెదా సుల్తానా, షరీఫున్నీసా, శ్రీనివాస్, శ్యాంరెడ్డి, కుమార్, గఫార్, వాహాబ్, అజ్జు, ఆసిస్ పాల్గొన్నారు.

మేడిబావి రెయిన్‌బో హోంలో..


చిన్నారులతో నందినీ

చిలకలగూడ : యాపిల్ హోం రియల్ నీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి మేడిబావి ప్రభుత్వ పాఠశాల, రెయిన్‌బో హోంలో నిర్వహించిన బాలిక దినోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నందిని భట్టి పాల్గొని బాలికలకు లోదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిషన్ భద్రత కార్యక్రమంలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రెండు లక్షల మంది బాలికలకు లోదుస్తులు పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించి అమలు చేయనున్నట్లు యాపిల్ హోం రియల్ నీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నీలిమ ఆర్య స్పష్టం చేశారు. స్త్రీ శక్తి ఫౌండర్ ప్రెసిడెంట్ తాడికొండ అనురాధ, ప్రభుత్వ ఆయుర్వేదిక్ కాలేజీ అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాతగోను, ప్రతినిధులు రమాదేవి, దీపికరెడ్డి పాల్గొన్నారు.

బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి


బాలికలకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రతినిధులు

పద్మారావునగర్: బాలికలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పలువురు వక్తలు సూచించారు. పద్మారావునగర్ ఎస్వీ కాలేజీలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ పి. సరోజినీ, టీసీఎస్ ప్రతినిధులు షాలిని, శ్రీనివాస్, టి. సుభాషిణి, వందన, షార్ట్ ఫిల్మ్ అవార్డు గ్రహీత టి. శ్రీకాంత్, వీవీ మహేశ్వర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. హేమలత మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలను ఆత్మస్థైర్యంతో ముందుకు సాగేలా తోడ్పాటునందించాలన్నారు. బాలికలు అన్ని విధాలా అభివృద్ధి చెందినప్పుడే సమాజం ప్రగతి పథంలో దూసుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం


పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న హేమ, సాయిబాబా

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ నాగులూరి నర్సింహా వీధిలో సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ట్రస్టీ, ప్రముఖ పారిశ్రామికవేత్త నాగులూరి సాయిబాబాతో కలిసి స్థానిక కార్పొరేటర్ సామల హేమ తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.2.60 లక్షల వ్యయంతో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణంతో కలుషిత జలాలు, లోప్రెషర్ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని హేమ పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలతో నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ అన్విత్, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, శంకర్, నవీన్, జకీర్, శైలేందర్, రవి పాల్గొన్నారు.

ఢిల్లీలో ఎన్‌సీసీ కేడెట్ల సత్తా


శ్రీకాంత్


ధీరజ్

రసూల్‌పురా: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన ఎన్‌సీసీ కేడెట్ల క్యాంప్‌లో ఏపీ. తెలంగాణ డైరెక్టరేట్లకు చెందిన సికింద్రాబాద్, తిరుపతి గ్రూప్‌కు చెందిన కేడెట్లు ప్రతిభ కనబరిచారు. పదిహేడు డైరెక్టరేట్ల పరిధిలోని తొమ్మిది అత్యుత్తమ కేడెట్ల స్థానంలో జూనియర్ డివిజన్ ఆర్మీ విభాగంలో తిరుపతి గ్రూప్ నుంచి సార్జంట్ ఎం. శ్రీకాంత్, సికింద్రాబాద్ గ్రూప్ నుంచి జూనియర్ డివిజన్‌లో నేవీ విభాగంలో నాగండ్ల ధీరజ్ బెస్ట్ కేడెట్ అవార్డును అందుకున్నారు. వీరిని జనవరి 28న ప్రధాని సత్కరిస్తారని అధికారులు తెలిపారు.

65 ఫీట్ల ఎత్తులో రెపరెపలకు సన్నద్ధం



ఓయూలో మరో నూతన ఆవిష్కరణ రేపు (26న) ప్రారంభం కానుంది. ఎంవీఎస్, మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట 65 ఫీట్ల ఎత్తులో జాతీయ జెండాను ఎగరేసేందుకు బుధవారం ఏర్పాటు చేశారు.
–సాక్షి, సిటీబ్యూరో

ఆకర్షణ.. పుస్తకాన్వేషణ

- 6,500 పుస్తకాల సేకరణ, తొమ్మిది లైబ్రరీల ఏర్పాటు
- ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఆహ్వానం


లైబ్రరీలో ఆకర్షణ


రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో..

సనత్‌నగర్: 'చినిగిన చొక్కయినా వేసుకో.. కానీ.. ఓ మంచి పుస్తకం కొనుక్కో' అనే నానుడి వింటే అర్థమవుతోంది పుస్తకానికి ఉన్న విలువ ఎలాంటిదో అని. ఔను..ఆమె పిన్న వయసులోనే పుస్తకం గొప్పతనాన్ని గుర్తించి ఎందరికో చదువుకునే భాగ్యాన్ని కలిగిస్తోంది. ఏకంగా 6500 పుస్తకాలను సేకరించి తొమ్మిది లైబ్రరీలను ఏర్పాటుచేసి పుస్తక పఠనంపై ఆసక్తిని రేపుతోన్న ఆ చిన్నారిని గణతంత్ర వేడుకలకు ఏకంగా రక్షణ శాఖనే ఆహ్వానం పలికింది. అరుదైన ఈ గౌరవాన్ని దక్కించుకున్న చిన్నారి 'ఆకర్షణ' గతంలో ప్రధానమంత్రి మన్‌కీ బాత్‌లో మాట్లాడి యావత్ భారతావని మనసు గెలుచుకుంది. అలాగే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముచే ప్రశంసలు అందుకుంది.

లైబ్రరీలతోనే మనసుకు సాంత్వన కలిగిస్తూ..

సనత్‌నగర్ లోధా అపార్ట్‌మెంట్‌కు చెందిన సతీష్, ప్రవిత దంపతుల కుమార్తె ఆకర్షణ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి సతీష్ హెల్త్‌కేర్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తుండగా, తల్లి ప్రవిత గృహిణి. 12 సంవత్సరాల వయసున్న ఆకర్షణ 2021 నుంచి ఇరుగుపొరుగు వారు, అపార్ట్‌మెంట్లు, తోటి విద్యార్థులు, బంధువుల నుంచి పుస్తకాలను సేకరించి తొమ్మిది లైబ్రరీలను ఏర్పాటు చేసింది. 2021లో ఎంఎన్‌జే కేన్సర్ చిల్డ్రన్ ఆస్పత్రిలోని రోగులకు, వారి సహాయకులకు ఆహారాన్ని అందించేందుకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన ఆకర్షణ అక్కడి వారి అవసరాలను తెలుసుకుని పుస్తకాలను సేకరించి లైబ్రరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మొట్టమొదటిసారిగా తనను ఈ పనికి ప్రేరేపించిన ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లోనే లైబ్రరీని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్, బోరబండ అల్లాపూర్ గాయత్రీనగర్ అసోసియేషన్, బాలికల కోసం జువైనల్, అబ్జర్వేషన్ హోమ్, కోయంబత్తూర్ సిటీ పోలీస్–స్టేట్ లైబ్రరీ, చెన్నై బాయ్స్ క్లబ్–నోలంబూర్ పోలీస్‌స్టేషన్, సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ పాఠశాల, సిద్దిపేట ఉమెన్ సేఫ్టీవింగ్ భరోసా సెంటర్, తమిళనాడు కన్యాకుమారి జిల్లాలోని కులితురై గ్రామంలో లైబ్రరీని ఏర్పాటు చేసి చిన్నారులు, పౌరుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందింపజేస్తోంది. అంతే కాకుండా తెలంగాణ ఆధారిత మానేరు రచయితల సంఘం, బాల సాహిత్య పరిషత్, దక్కన్ సాహిత్య సభలు ఆమె లైబ్రరీల ఏర్పాటుకు వెయ్యి పుస్తకాలు విరాళంగా అందజేసేందుకు ముందుకు వచ్చాయి. అలాగే భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కూడా లైబ్రరీ కార్యక్రమాల నిమిత్తం వెయ్యి పిల్లల పుస్తకాలను విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చింది.

ప్రముఖుల మన్ననలు..

ఆకర్షణ చేస్తున్న ఈ పుస్తక యజ్ఞం గురించి దేశ నలుమూలలా పాకింది. 2023, సెప్టెంబర్ 24న ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ 105వ ఎపిసోడ్‌లో స్వయంగా ప్రధానమంత్రి ఆకర్షణతో మాట్లాడి ఆమె చేస్తున్న లైబ్రరీ సేవలకు అభినందనలు తెలిపారు. అలాగే 2023 డిసెంబర్‌లో హైదరాబాద్ పర్యటన సమయంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్మును కలిసే అవకాశం కూడా లభించడమే కాదు ఆమె చేస్తున్న లైబ్రరీల ఏర్పాటు ప్రయత్నాలను ప్రశంసించారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పోలీసు ఉన్నతాధికారుల ప్రశంసలను ఆకర్షణ అందుకుంది. ఆకర్షణగా ఇప్పుడు మరో అరుదైన అవకాశాన్ని పొందింది. శుక్రవారం ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనేందుకు రక్షణ శాఖ ఆమెకు ఆహ్వానాన్ని పంపడమే కాకుండా విమాన టికెట్లు, హోటల్ బస ఏర్పాట్లను కూడా చేసింది. పుస్తక పంపిణీ, పఠన ప్రోత్సాహం పట్ల ఆమె నిబద్ధత ఎందరికో స్ఫూర్తినిస్తుందని చెప్పడంలో సందేహం లేదు. బుధవారం సాయంత్రం తల్లిదండ్రులతో కలిసి ఆమె ఢిల్లీ బయలుదేరారు.

దళితులపై వివక్ష చూపుతున్న బీజేపీని ఓడించాలి


మాట్లాడుతున్న బర్రె యాదగిరి

లాలాపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశ వ్యాప్తంగా దళితులపై తీవ్రమైన వివక్ష కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంట్ వైస్ చైర్మన్ బర్రె యాదగిరి ఆరోపించారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశానికి అత్యున్నతమైన పదవి రాష్ట్రపతిగా ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించినప్పటికీ వారిని సైతం వివక్షకు గురి చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం, అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి రాష్ట్రపతికి సైతం అవకాశం ఇవ్వలేకపోయిందన్నారు. దేశం వ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో దళితులు, ఆదివాసీలపై దాడులు, అత్యాచారాలు నిత్యకృత్యంగా మారాయన్నారు. రాముడు అందరి వాడంటూనే దళితులను వేరు చేసే సంఘటనలు జరగడం దుర్మార్గమన్నారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవానికి రాజస్థాన్‌లోని ఓ గ్రామంలో దళితులు సేకరించిన విరాళాలు పనికి రావంటూ వెనక్కి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో దళితులు, అణగారిన వర్గాలపై వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. కుల వివక్ష ప్రదర్శించిన వారిపై పోలీసు స్టేషన్‌లో కేసు పెడితే చట్టానికి కట్టుబడి పని చేయాల్సిన రాజస్థాన్ పోలీసులు దళితులపై ఒత్తిడి తీసుకురావడం పద్ధతి కాదన్నారు. బీజేపీ ప్రభుత్వానికి హిందువులపై ప్రేమ లేదని కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే రాముడు, మతాన్ని వాడుకుంటుందని అందుకే కాంగ్రెస్ పార్టీ అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవానికి వెళ్లలేదన్నారు. దేశంలోని దళితులంతా ఏకమై లోకసభ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

సనత్‌నగర్: నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే తన ధ్యేయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌లోని మాతాజీనగర్‌లో గత వారం రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా బుధవారం ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. మాతాజీనగర్ పల్లంలో ఉండడంతో ఎగువ ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీటితో పాటు వర్షాలు పడిన సమయంలో వరదనీరు ఇక్కడకు చేరుతుందని, దీంతో డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇక్కడి డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి పనులు చేపట్టడం జరిగిందని ఇప్పటికే సగం వరకు పైప్‌లైన్లు వేశారని, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో పాటు నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య ఉన్నారు.

ధ్వని, వాయు కాలుష్యాన్ని నియంత్రించాలి


మాట్లాడుతున్న డీసీపీ రంగారావు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చిలకలగూడ : ధ్వని, వాయు కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని ఆలుగడ్డ బావి వద్ద బుధవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాలకు పొల్యూషన్ చెక్ చేయించుకోవాలన్నారు. అవసరమయితేనే హారన్ కొట్టాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. సౌండ్‌పొల్యూషన్ చేస్తూ వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి జరిమానాలు విధించారు. ఎస్ ఐ శ్రీధర్, ఏఎస్ఐ మహేంద్రమణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన..

రసూల్‌పురా: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అందరి బాధ్యతని నార్త్‌జోన్ ట్రాఫిక్ అదనపు డీసీపీ ఎస్.రంగారావు తెలిపారు. సికింద్రాబాద్ పీజీ కళాశాలలో హైదరాబాద్ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, తెలంగాణ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీసీపీ మాట్లాడుతూ చాలా మంది యువత మత్తు, మద్యానికి అలవాటు పడి భవిష్యత్‌ను కోల్పోతున్నారని డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సిగ్నల్స్ జంపింగ్, శబ్ద కాలుష్యం చేస్తూ వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణవుతున్నారని అన్నారు. అనంతరం పీజీ కళాశాల నుండి ప్యాట్నీ చౌరస్తా, బేగంపేట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్రాజు, విజయరావు, జిల్లా యువజన అధికారి కుష్బూ గుప్త, పీజీ కళాశాల ప్రిన్సిపల్ జే. రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మృదుల పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 25, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 28, గోకరకాయ 50, కీర 18, దోసకాయ 25, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 60, మొరంగడ్డ 26, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు.

నేడు చండీహోమం

సనత్‌నగర్: పుష్యమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో గురువారం చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు చండీహోమం, అలాగే దత్తాత్రేయ స్వామివారికి ఉదయం 6 గంటలకు అభిషేకం, 10 గంటలకు దత్తహోమం ఉంటాయన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన చామకూర సుజాత



పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ నాయకులు దివంగత చామకూర ప్రదీప్ సతీమణి సుజాత కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చామకూర సుజాత, ఆమె తనయుడు సాయి రోహిత్ ఇరువురు బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సుజాత, సాయిరోహిత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

అడ్డగుట్ట: డివిజన్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి అన్నారు. బుధవారం అడ్డగుట్ట బీ–సెక్షన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పనులను పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు లింగాని శ్రీను, మహ్మద్, ఎల్లయ్య, వసంత, నర్సింగ్, ఇస్మాయిల్, వడ్లూరి రవి, నరేష్, గోపీ పాల్గొన్నారు.

ఓయూలో ఎమ్మెల్యే వివేక్‌కు సన్మానం


ఎమ్మెల్యే వివేక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని బుధవారం ఓయూలో సన్మానించారు. ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో ఓయూ జేఏసీ, టీఎస్ జాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తల్లమల్ల శ్వేత అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే వివేక్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గణేష్, కాంగ్రెస్ నాయకురాలు వెన్నల గద్దర్, ఓయూ అధ్యాపకులు డాక్టర్ ప్రేమయ్య, లాయర్ సురేష్‌యాదవ్, గడ్డం శ్రీనివాస్, షేక్ అనీఫ్, హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, ఈఎస్ఐ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్ఆర్‌నగర్ వేంకటేశ్వర స్వామి టెంపుల్ లేన్, బీ–టైప్ క్వార్టర్స్, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ మెయిన్‌రోడ్డు, గౌతమి ధామం స్కూల్ ఏరియా, ఓల్డ్ రిలయన్స్ ఫ్రెష్, జ్ఞాన సరస్వతి స్కూల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బాపూనగర్, జస్టిస్ ఎన్వీరమణ నివాస ప్రాంతం, అప్పర్ వాటర్ ట్యాంక్, ఆంధ్రాబ్యాంక్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

కంటోన్మెంట్ పరిధిలో..

కంటోన్మెంట్: ఫీడర్ల మరమ్మతు, చెట్ల కొమ్మల నరికివేత కారణాలతో కంటోన్మెంట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నాగదేవత టెంపుల్, జ్యోతికాలనీ ఫీడర్ల పరిధిలోని జ్యోతికాలనీ, కాకగూడ, బీటీకాలనీ, బ్రూక్ బాండ్ కాలనీ, జూపిటర్ కాలనీ, సిరిపురి కాలనీ, వాసవీ బీ సెక్టార్, న్యూ వాసవీ, గృహలక్ష్మి కాలనీ, ఇషాక్ కాలనీ. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 వరకు రామ్‌నగర్, లలిత నగర్ ఫీడర్ల పరిధిలోని రామ్‌నగర్, మారుతి నగర్, అల్వాల్, కృష్ణపురి కాలనీ, లలిత నగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పాఠశాలలో అదనపు గదులకు చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్


ఆదయ్యనగర్ స్కూల్‌లో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజా అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో కలిసి ఓల్డ్ గాస్ మండిలోని ఆదయ్య మెమోరియల్ హైస్కూల్‌ను సందర్శించారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో అదనపు తరగతి గదులను నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిప్యూటీ డీఈఓ చిరంజీవులు, ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డిను ఆదేశించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందుల్లేకుండా వారి అభీష్టం మేరకు నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. క్రీడామైదానంలో నిర్మాణాలు చేపట్టరాదని స్థానికులు డిమాండ్ చేయగా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే వెంట జీహెచ్‌ఎంసీ ఈఈ సుదర్శన్, వీధిదీపాల ఏఈ భరత్, జలమండలి ఏఈ సంధ్య, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్‌గౌడ్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలకు వినతి


తహసీల్దార్ పద్మ సుందరికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ బుధవారం మారేడుపల్లి మండల కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కబ్జాచేసి కోర్టు కేసు పేరుతో అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. సదరు ప్రభుత్వ భూమిని ఆస్పత్రికి కేటాయించినప్పటికీ కోర్టు కేసు పేరుతో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, అందువల్ల కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో యాదగిరి, గౌరీ నాగరాజు, రామస్వామి ఉన్నారు.

ఓటుపై చైతన్యం


ఓటు హక్కుపై ప్రచారం చేస్తున్న జేఎస్‌టీ శాయి


సనత్‌నగర్: ఓటుహక్కు వినియోగం, పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతుంటారు. ఎన్నికల కమిషన్, అధికారుల ప్రయత్నాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు సైతం ఈ ప్రచార యజ్ఞంలో పాలుపంచుకుంటూ వస్తున్నారు. అలాంటి వారిలో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ముందువరుసలో ఉంటారు. కొన్ని దశాబ్దాలుగా ఓటుపై చైతన్యం తీసుకువచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకుందాం అంటూ కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. మన చుట్టుపక్కల వారిని కూడా ఓటు హక్కును వినియోగించుకోవడాన్ని ప్రోత్సాహించాలని, అందరూ ఓట్లు వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా మంచివారు, నేరచరిత్ర లేనివారికే ఓటేయాలంటూ అవగాహన కల్పిస్తున్నారు.

రాళ్ల దాడిలో ముగ్గురికి గాయాలు


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

రాంగోపాల్‌పేట్: పలువురు వ్యక్తులు రాళ్లతో పరస్పర దాడి చేసుకోవడంతో ముగ్గురు గాయపడిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం టోలీచౌకికి చెందిన ఫయాజ్‌ఖాన్ (32), అబిద్‌ఖాన్ (32) అన్నదమ్ములు. ఫయాజ్‌ఖాన్ భార్య చనిపోవడంతో క్లాక్‌టవర్ వద్ద ఫుట్‌పాత్‌పైనే ఉంటున్నాడు. అతడిని కలిసేందుకు అబిద్‌ఖాన్ క్లాక్‌టవర్ వద్దకు వచ్చాడు. అన్నదమ్ములిద్దరూ మాట్లాడుకుంటుండగా ఫుట్‌పాత్‌పైనే నివసించే రాజు మరో వ్యక్తిపై దాడి చేస్తున్నాడు. ఎందుకు కొడుతున్నావని అబిద్‌ఖాన్ రాజును మందలించడంతో అబిద్‌ఖాన్‌పై దాడి చేస్తుండటాన్ని గమనించి ఫయాజ్‌ఖాన్ రాజుపై దాడి చేశాడు. అందరూ మద్యం మత్తులో ఉండటంతో ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో అబిద్‌ఖాన్, ఫయాజ్‌ఖాన్, రాజు గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు పోలీసుల సహాయంతో ముగ్గురిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నారు.

సైలెన్సర్ మార్చిన సుడాన్ యువకుడిపై కేసు


సూడాన్ యువకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

లాలాపేట: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు తార్నాకలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో రేసింగ్ బైక్ బుల్లెట్‌కు సైలెన్సర్ మార్చి వెళ్తున్న సుడాన్ దేశానికి చెందిన యువకుడిపై కేసు నమోదు చేశారు. పెద్ద శబ్దాలు వచ్చే హారన్స్, సైలెన్సర్ శబ్దాలతో ప్రమాదాలకు కారణం అవుతున్నారని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమానా విధించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు పేర్కొన్నారు.